క్లుప్తంగా

క్వింటా కందులు రూ.7,550తో కొనుగోలు



కూడేరు: కందులను పరిశీలిస్తున్న ఏఓ విజయకుమార్

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం, ముద్దలాపురం గ్రామాల్లో ఈ నెల 27 నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఏఓ విజయకుమార్ తెలిపారు. గురువారం ఆయన ముద్దలాపురం, పి.నారాయణపురం గ్రామాల్లో పర్యటించారు. రైతులు పండించిన కందులను పరిశీలించారు. లక్ష్మీనరసింహ స్వామి రైతు ఉత్పత్తిదారుల సంఘం తరఫున క్వింటా కందులు రూ.7,550తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఎకరాకు 2.5 క్వింటాళ్లు చొప్పున ఎన్ని ఎకరాలు ఈ–క్రాప్ చేయించుకొని ఉంటే అన్ని ఎకరాలకు సంబంధించి కందులు కొనుగోలు చేస్తారన్నారు.

హైవే సమస్య పరిష్కారానికి కృషి

డీ హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండల కేంద్రంలో బళ్లారి – బెంగళూరు జాతీయ రహదారి మధ్య తలెత్తిన ఫ్లైఓవర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. గురువారం బళ్లారి ఎంపీ తుకారాం, జాతీయ రహదారుల విభాగం అనంతపురం సర్కిల్ పీడీ శిరిష, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలసి హైవే పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డి హీరేహాళ్‌ను విడదీసేలా ఏర్పాటు కాబోతున్న ఫ్లైఓవర్ మట్టితో కాకుండా పిల్లర్లతో అండర్‌పాస్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో ఫాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలు అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు.దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

భంభంస్వామి దర్గాలో పూజలు



భంభంస్వామి జీవసమాధి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమ దర్గాలో భంషేక్ అబ్దుల్ స్వామి జీవ సమాధిని గురువారం పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ప్రత్యేక ఫాతెహా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

జీవనోపాధి మెరుగునకు చర్యలు




వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: చేతి వృత్తిదారులను గుర్తించి, వారికి వృత్తి నైపుణ్య శిక్షణతో జీవనోపాధి మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సిటీ లైవ్లీహుడ్ కింద మెప్మా ఎండీ తేజ్‌భరత్‌తో జరిగిన సిటీ లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌పై వీడియో కాన్ఫరెన్సు జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ వివిధ రకాల వృత్తులు చేసే వారికి ప్రత్యేక రిజిస్ట్రేషన్ వసతి కల్పించి, నైపుణ్య అభివృద్ధిపై మరింత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మెప్మా టీపీఎం నారాయణరెడ్డి, ఏఈ ప్రతాప్, సీనియర్ అసిస్టెంట్ కిశోర్, సీవోలు పాల్గొన్నారు.

కడదరకుంటలో పశుఆరోగ్య శిబిరం

కూడేరు:కడదరకుంటలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పా టు చేశారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పశువులకు వచ్చే వ్యా ధులపై పశుపోషకులు, రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి శ్రీనివాసులు, ఎల్ఎస్ఏ భాగ్యలక్ష్మీ, ఏహెచ్ఏలు భవాని, శారద, రామాంజనేయులు, రఘువర్ధన్, దామోదర్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జుల ఏలుబడి.. పర్యవేక్షణ కొరవడి



- అదనపు భారంతో మండల విద్యాధికారులు సతమతం
- 15 మండలాలకు ఆరుగురు కొరత
- ఏళ్లతరబడి పాతుకుపోయిన కొందరు ఎంఈఓలు
- సీనియర్ హెచ్‌ఎంలకే అదనపు బాధ్యతలు
- గాడి తప్పుతున్న విద్యాప్రమాణాలు

రాయదుర్గం: విద్యాశాఖలో 'ఇన్‌చార్జ్‌ల ఏలుబడి.. పర్యవేక్షణ కొరబడి' అన్నట్లుంది పరిస్థితి. అదనపు భారంతో మండల విద్యాధికారులు అవస్థలు పడుతున్నారు. 15 మండలాలకు ఆరుగురు విద్యాధికారుల కొరత ఉంది. దీంతో సీనియర్ హెచ్‌ఎంలకే అదనపు బాధ్యతలు అప్పగించడంతో రెండు బాధ్యతలూ చూడలేకపోతున్నారు. అదనపు బాధ్యతలో కొందరు కార్యాలయాల్లో కూర్చొని సంతకాలకే పరిమితమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు వెళ్లలేని పరిస్థితి. దీంతో విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. దీనికి తోడు కొందరు ఎంఈఓలు పదేళ్లకు పైగా ఒకేచోట పాతుకుపోయారు. ఒకే నియోజకవర్గంలోనే ఒకటి, రెండు మండలాలు మారుతూ.. కుర్చీ పదిలం చేసుకుంటున్నారు. కూడేరు ఎంఈఓ ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆఖరుకు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఆ మండలంలోనూ ఇన్‌చార్జ్ ఎంఈఓ పనిచేస్తున్నారు.

కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 15 మండలాలకు ఆరు ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో అత్యధికంగా రాయదుర్గం నియోజకవర్గంలో డి హీరేహాళ్, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట మూడు మండలాలకు మండల విద్యాధికారులు లేరు. రాయదుర్గం, కణేకల్లు మండలాల ఎంఈఓలు ఆయా మండలాలకు ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కళ్యాణదుర్గంలో కంబదూరు, కుందుర్పి, ఉరవకొండలో కూడేరు మండలాలకు ఎంఈఓల కొరత గత కొంత కాలంగా వేధిస్తోంది. మూడు నియోజకర్గాల్లోని ప్రాథమిక, ప్రథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 777 ఉన్నాయి. ఇందులో సుమారు 1,18,530 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల పర్యవేక్షణ కొరవడింది. మరోవైపు సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించారు. రెండు చోట్ల బాధ్యతలు వారికి భారంగా మారుతున్నాయి.

నామమాత్రంగా క్లస్టర్ రీసోర్స్ పర్సన్ల తనిఖీలు

ఎస్ఎస్ఏ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు, ఇతర సిబ్బంది పాఠశాలల తనిఖీలకు మొక్కుబడిగా హాజరవుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరైతే ఎమ్మార్సీల్లోనే తిష్టవేస్తూ కాలయాపనతో సరిపెట్టేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా వీరిందరిపైనా పర్యవేక్షణ చేసే ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉండడంతోనే ఈ సమస్యలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కర్ణాటక సరిహద్దులో నున్న మండలాలకు రెగ్యులర్ ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యాశాఖలో జవసత్వాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖకు జవసత్వాలు తీసుకొచ్చారు. నాడు–నేడుతో ప్రభుత్వ బడులన్నీ కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. విద్యాప్రమాణాలు మెరుగు పరిచారు. ఎంఈఓలు పనిభారంతో సతమతమైతే విద్యావ్యవస్థ గాడి తప్పుతుందని గుర్తించి ఎంఈఓ–2 విధానాన్ని అమలులోకి తెచ్చారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఈ బాధ్యతలు అప్పగించి, పర్యవేక్షణకు వినియోగించారు. తద్వారా నాణ్యమైన విద్య అందించడంలో సఫలీకృతులయ్యారు. పేదలకు ఆంగ్ల మాధ్యమం, ప్రతి సబ్జెక్టుకు ఓ ఉపాధ్యాయుడు, డ్రాపౌట్స్ తగ్గించేందుకు అమ్మఒడి, సరికొత్త మెనూకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుత కూటమి సర్కార్ వీటన్నింటిని గాలికి వదిలేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యత వహిస్తున్నా.. విద్యావ్యవస్థను గాడిలో పెట్టలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో ఎంఈఓకు రెండు, ఆపై మండలాలు కేటాయిస్తే ఎటూ న్యాయం చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులు సైతం వారి సమస్యల పరిష్కారం కోసం ఎమ్మార్సీ చుట్టూ తిరగాల్సి వస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యాప్రమాణాలు పెంపునకు కృషి



జిల్లా వ్యాప్తంగా విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా కృషి చేస్తున్నాం. కొన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలు లేకపోయినా సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. దాదాపు అన్ని మండలాల్లోనూ ఎంఈఓ–2 పోస్టులు ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో రెగ్యులర్ ఎంఈఓల నియామకానికి కృషి చేస్తాం. ప్రస్తుతం ఏ ఇబ్బంది లేకుండా అన్ని మండలాలకు ఎంఈఓల సేవలు వినియోగిస్తున్నాం. ఒకటి రెండు చోట్ల అలాంటి సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. సీఆర్‌పీలు కార్యాలయాలకే పరిమితమైతే చర్యలు చేపడతాం.

– ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి



శెట్టూరు సర్వసభ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మంజునాథ



మాట్లాడుతున్న ఎంపీడీఓ దాసనాయక్

డి హీరేహాళ్ (రాయదుర్గం): వేసవి సమీపిస్తున్న దృష్ట్యా మండలంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఎం. పవిత్ర అధికారులను ఆదేశించారు. గురువారం డీ హీరేహాళ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అధికారిగా కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావ్, ఎంపీడీఓ దాసనాయక్, తహసీల్దార్ మునివేలు హాజరయ్యారు. ముందుగా శాఖల వారీగా పురోగతి, జరిగిన అభివృద్ధిపై అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. తాగునీటి కొరత రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పనుల్లో వేగం పెంచాలన్నారు. అనంతరం ఉపాధి నిధుల ద్వారా చేపట్టే సీసీరోడ్లు నాణ్యతగా నిర్మించాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బళ్లారి లింగన్న, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని ప్రభుత్వం

శెట్టూరు: రైతులను ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోలేదని, ఈక్రాప్ చేయడం వల్ల ఒరిగిందేమీలేదని సభ్యులను అధికారులను నిలదీశారు. రైతులకు రైతు భరోసా లేదు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ లేదన్నారు. గురువారం మండల కేంద్రంలో సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మంజునాథ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. ప్రభుత్వం (పశువుల షెడ్లు) మినీగోకులాలు, ఇతర పథకాలు ప్రవేశ పెట్టినా అనర్హులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లు, రైతులకు వన్య ప్రాణుల వల్ల పంటనష్టం తదితర అంశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, డాక్టర్ తరుణసాయి, ఎంఈఓ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ సురేంద్ర ప్రసాద్, ఎంపీఓ నీరజ, ఏఓ వాసుకిరాణి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, ఎంపీటీసీలు నరసింహులు, పవిత్ర, గీతమ్మ, సర్పంచులు విరూపాక్షి గౌడ్, ఈరన్న, వెంకటేశులు, విరుపాక్షి, సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- డీసీహెచ్ పాల్ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్ పాల్ రవికుమార్

రాయదుర్గం: రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని డీసీహెచ్ పాల్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం మెడికల్, నర్సింగ్ సూపరింటెంట్లు మెర్సీ జ్ఞానసుధ, పార్వతి ఆధ్వర్యంలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ మాట్లాడారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత తీర్చేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం చిన్నపిల్లలు, కంటి వైద్యులను నియమించామన్నారు. త్వరలో ఆర్థో డాక్టర్, ఈఎన్‌టీ డాక్టర్ నియామకానికి చర్యలు చేపట్టామన్నారు. పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భర్తీకి వచ్చే వారం నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. అర్హత ఆధారంగా పోస్టుల నియామకానికి చర్యలు చేపడతామన్నారు. ఆస్పత్రిలో ఒకరిద్దరిలో సమన్వయం లోపించిందన్నారు. అలాంటి వారిపై విచారణ చేపట్టి కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ ఆదేశాలను దిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన భవన నిర్మాణాలను త్వరలో పూర్తిచేసేలా కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లోనే పశువులకు మెరుగైన వైద్యసేవలు



తట్రకల్లులో గోకులంషెడ్డును పరిశీలిస్తున్న పశువైద్యాధికారి కృష్ణమూర్తినాయక్

వజ్రకరూరు: పల్లెల్లోనే పశువులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు పశువైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ తెలిపారు. గురువారం మండలంలోని పందికుంట, పందికుంట తండాలో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశువైద్య శిబిరంలో 4,200 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు అందించారు. 20 ఆవుదూడలు, గేదెలకు డీవార్మింగ్ మందు అందించారు. 20 పశువులకు సూడి పరీక్షలు చేశారు. తట్రకల్లు గ్రామంలో గురువారం నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డును పశువైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచు ఉమామహేశ్వరి, జేవీఓ భద్రు నాయక్, ఎహెచ్ఎస్‌లు వెంకటేష్, రఫి, అజుబా పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టాలి



ఇంద్రావతి వద్ద హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఉరవకొండ: హంద్రీనీవా కాలువ డిస్ట్రిబ్యూటరీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఇంద్రావతి వద్ద శిథిలావస్థకు చేరిన హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలను సీపీఐ నాయకులు పరిశీలించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనులు లైనింగ్ కాకుండా వెడల్పు చేసి జిల్లాకు అదనంగా నీరు తీసుకోరావాలన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందేలా కృషి చేయాలన్నారు. జీబీసీ ఆధునీకరణ పనులు చేపట్టి గుంతకల్లు, ఆలూరు రైతుల చివరి భూములకు సాగునీరు ఇవ్వాలన్నారు. తుంగభద్ర నికర జలాలు వాడుకోవడానికి హెచ్ఎల్‌సీ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. పీఏబీఆర్ జలాశయం నుంచి తుంగభద్రకు 11 టీఎంసీల నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ చూపి పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, చెన్నరాయుడులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాక్సులు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

రాయదుర్గం: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలించుకు రావడమే కాకుండా అధిక ధరకు విక్రయిస్తున్న ఇద్దరిని గుర్తించినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం రాయదుర్గం ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బందితో కలిసి వివరాలు ఆయన వెల్లడించారు. రాయదుర్గంలోని భంభంస్వామి ఏరియాకు చెందిన ఎరికల నాగరాజు, చాకలి విశ్వనాథ్ వారి నివాసాల్లో నిల్వ చేసిన కర్ణాటకకు చెందిన రూ.50 వేలు విలువ చేసే 10 కేసుల మద్యం బాక్సులు పట్టుబడ్డాయన్నారు. కాగా, నిందితులు పరారీ కావడంతో వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

పశుసంవర్ధక శాఖ డీడీకి సన్మానం



డీడీ డాక్టర్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న ప్రత్యేక అధికారిణి రజనికుమారి

ఉరవకొండ: ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో వందశాతం పశుగణన పూర్తి చేయడంతో పాటు పశువైద్యశిబిరాలు విజయవంతం చేస్తున్న డీడీ వెంకటేష్‌ను గురువారం ఆశాఖ అధికారులు సన్మానించారు. ఉరవకొండ డీడీ కార్యాలయంలో విజయవాడకు చెందిన పశువైద్య శిబిరాల పర్యవేక్షణ అధికారిణి రజనీకుమారి చేతుల మీదుగా డీడీని సత్కరించి, జ్ఞాపికను అందించారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



వజ్రకరూరు:స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అర్చనలు, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

నీటి సరఫరా బంద్

రాయదుర్గంటౌన్: పట్టణంలో 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ హెచ్చెల్సీ శాశ్వత మంచినీటి పథకం కింద వీరాపురం పంప్‌హౌస్ వద్ద వాల్స్ పగిలిపోయి, కరెంటు మోటార్ల మరమ్మతుకు గురైనట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో మరమ్మతు పనులు ప్రారంభించినట్లు తెలిపారు.

మాళాపురంలో ఇరువర్గాల ఘర్షణ

ఉరవకొండ (విడపనకల్లు): విడపనకల్లు మండలంలోని మాళాపురంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పర దాడిలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. గ్రామంలో బుధవారం ఊరిదేవర ఘనంగా నిర్వహించారు. దేవరలో ఘర్షణ చోటు చేసుకోగా, పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేసి, సద్దుమణిగించారు. గురువారం ఇరువర్గాల వారు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గ్రామానికి చెందిన ధనంజయ, వన్నూరుస్వామి వ్యక్తులకు గాయాలయ్యాయి. వీరికి ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి నుంచి అత్యవసర చికిత్స కోసం అనంతపురం తరలించారు. అనంతరం సీఐ సయ్యద్ చిన్నగౌస్ గ్రామంలో ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం కారు ద్విచ క్రవాహనం ఢీకొని ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన సురేంద్ర, వీరేంద్ర, వలిబాషా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనింది. దీంతో ముగ్గురు యువకుల కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



కూడేరు : చోళసముద్రం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు

కూడేరు: మండలానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో (2023 సెప్టెంబర్) 132–33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కోసం రూ.88 కోట్లు మంజూరయ్యింది. అక్టోబర్ 17న ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ మండల పరిధిలోని చోళసముద్రం పరిసర ప్రాంతాల్లో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. గురువారం అనంతపురం రెవెన్యూ డివిజన్ ఆర్డీఓ కేశవనాయుడు విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలనకోసం చోళసముద్రంలో పర్యటించారు. మండల రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ 1062, 1063లోని 7 ఎకరాల 45 సెంట్లను చూపించారు. ఆ స్థలం సబ్ స్టేషన్ నిర్మాణానికి అనువుగా ఉంటుందా? లేదా అని ఆర్డీఓ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, డీటీ సూర్య ప్రతాప్, సర్వేయర్ ఆయేషా సిద్ధికి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ

కూడేరు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో త్రివేణి, కుబేర పేరిట ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీజీబీ మేనేజర్ రవికుమార్ గురువారం తెలిపారు. ఇతర బ్యాంకుల కంటే వడ్డీ శాతాన్ని వర్తింపు చేస్తున్నట్లు తెలిపారు. త్రివేణి స్కీం కింద రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే 333 రోజులు (11 నెలలకు)కు రూ.7 వేలు వడ్డీ వర్తిస్తుందన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి రూ.7,500 వర్తిస్తుందన్నారు. కుబేర స్కీం కింద 444 రోజులు (14 నెలలకు) రూ.9,500, 60 ఏళ్లు పైబడిన వారికి రూ.10,100 వర్తిస్తుందన్నారు.

సకాలంలో పన్ను చెల్లించండి

రాయదుర్గంటౌన్:పురపాలక సంఘంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో పన్ను బకాయిదారులు సకాలంలో పన్ను చెల్లించాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడారు. వంద శాతం పన్ను వసూలుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. యజమానులు బకాయిదారులు అనిపించుకోకుండా సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. పురపాలక సంఘంలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.5,23 కోట్లకుగాను ఇప్పటి దాకా రూ.2.71 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నీటి పన్ను డిమాండ్ రూ.3.78 కోట్లకు గాను రూ.91 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం త్వరలో వార్డుల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొండి బకాయిదారులకు రెడ్‌నోటీసులు జారీ చేస్తామన్నారు.

మోడల్ బుక్‌లెట్లు పంపిణీ



మోడల్ పేపర్లను పంపిణీ చేస్తున్న అధికారులు

బెళుగుప్ప: మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష బుక్‌లెట్లను గురువారం పంపిణీ చేశారు. బెళుగుప్పలో పాఠశాల పూర్వ విద్యార్థి పెద్దతిప్పయ్య, గంగవరంలో ఉపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, రామసాగరంలో గోవర్ధన నాయుడు, తగ్గుపర్తిలో యు.శ్రీనివాసులు, నరసాపురంలో వి.అర్జున్ వితరణ చేశారు. మోడల్ పేపర్‌లను బెళుగుప్పలో హెచ్‌ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రుద్రయ్య, ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ, యూటీఎఫ్ నాయకులు ఓబుళపతి, అర్జున్‌తో కలిసి పంపిణీ చేశారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీలోని దొడగట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు.